RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com
తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం 8 అక్టోబర్ 2024
సంపుటి: 2 | సంచిక: 148 | పేజీలు: 4 | వెల: రూ.5/-



హైదరాబాద్ సీఎస్ఎంపీని

# అమృత్ 2.0లో చేర్చండి

మెట్రో రైలు రెండో దశకు మద్దతు ఇవ్వండి

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

2లో..




# తుదిదశకు మావో తీవ్రవాదం

ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణ

తీవ్రవాదం అంతానికి కలిసి పనిచేద్దాం

ఆయుధాలు వదిలేసిన 13 వేల మందికి పైగా మావోలు

గిరిజనులకు అభివృద్ధి పథకాలు చేర్చాలన్నదే లక్ష్యం

మావోయిస్ట్ ప్రభావిత రాష్ట్రాల సమావేశంలో అమిత్ షా

న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు): మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరుకుందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల సీఎంల సదస్సు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ప్రారంభమైంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మావోయిస్టు తీవ్రవాదం అంతం కోసం అన్ని రాష్ట్రాలు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో మావోయిస్టు తీవ్రవాదం తుదిదశకు చేరింది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటివరకు 13 వేల మందికి పైగా మావోయిస్టులు ఆయుధాలు వదిలేశారు. 2024లో 202 మంది మావోయిస్టులు మృతిచెందగా.. 723 మంది లొంగిపోయారు. భవిష్యత్తులో మరింత స్ఫూర్తితో ఒకే లక్ష్యంతో ముందుకెళ్లాలి. ఛత్తీస్‌గఢ్ విజయం అందరికీ ప్రేరణగా నిలుస్తోంది. అక్కడ కొందరు మావోయిస్టులు లొంగిపోయారని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టు రహితంగా మార్చేందుకు అన్ని రాష్ట్రాలు సహకరించాలని షా పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఛత్తీస్‌గఢ్ సీఎం, డీజీపీని ఆయన అభినందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ప్రయోజనాలు ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. పదేళ్లలో మోదీ సర్కార్ చేసిన అభివృద్ధి గురించి వివరించారు. 'పదేళ్లలో 11,500 కిలోమీటర్ల మేర రోడ్ నెట్‌వర్క్‌తో పాటు 15,300 సెల్‌ఫోన్ టవర్లను ఏర్పాటు చేశాం. 165 ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు ఏర్పాటుచేశాం. గతంలో హింసాత్మక ఘటనలు 16,400కు పైగా జరిగాయి. ప్రస్తుతం ఇలాంటి ఘటనలు 7,700లకు తగ్గాయని వెల్లడించారు. పౌరులు, భద్రతా బలగాల మరణాలు 70 శాతం తగ్గాయి. హింస ప్రభావిత జిల్లాలు 96 నుంచి 42కు

..మిగతా 2లో

నిజాంలు మన నవాబులు..

# అందుకే మన సలాములు

ప్రభాత సూర్యుడు చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్ రావు ప్రత్యేక శీర్షిక

- తెలంగాణలో పుట్టబోయే ఆడపిల్లల పేర్లు మూసిగా పెట్టుకునేటట్లు.
- మూసిని సుందరీకరణ ప్రక్షాళన చేస్తా! అని సీఎం రేవంత్ రెడ్డి మాటలను ఆహ్వానించాల్సిందే!
- అప్పట్లోనే హైదరాబాదు రోడ్లను "రోల్స్ రాయి" వాహనాలతో శుభ్రపరచిన నిజాం నవాబులు!
- భారత్ లో రైల్వే రవాణాకు అంకురార్పణ చేసింది నిజాం నవాబులే!
- హైదరాబాద్ నగర ప్రజల దాహార్తి తీర్చింది మూసీనదియే!
- సీఎం రేవంత్ రెడ్డి మూసీనది పరివాహిక ప్రాంత అక్రమ కట్టడాలను నేలమట్టం చేసి, మూసి సుందరీకరణ చేసే ప్రక్షాళనను ఆహ్వానించాల్సిందే!
- ఇండ్లు కోల్పోతున్న మూసి పరివాహిక ప్రాంత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకొని, పక్క ఇల్లు నిర్మించి ఇవ్వాల్సిందే!



విశ్వ విఖ్యాత రోల్స్ రైస్ కంపెనీ కార్లను నిజాం నవాబులు రోడ్లు చెత్తను ఊడ్చడానికి వాడిన వాహనాలు



నిజాం పాలకులు ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ అఫ్జల్ గంజ్ లో కట్టించిన అతి పురాతన ఉస్మానియా జనరల్ ఆసుపత్రి

హైదరాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు): భారతదేశ చిత్రపటంలో తెలంగాణ ప్రాంతానికి చారిత్రాత్మకమైన గుర్తింపు ఉన్నదంటే తెలంగాణ గడ్డను పాలించిన నిజాం నవాబుల దూరదృష్టితో పాటు ప్రజల ప్రభుత్వ పాలన అనడంలో ఎటువంటి సందేహం లేదు. అప్పట్లోనే "రోల్స్ రాయి" వాహనాలతో రోడ్లను శుభ్రపరచిన పరిపాల దక్షకులు గా పేరొందిన "మన నిజాంలు మన నవాబులు" అందుకే మన సలాములు. మచ్చుకకు ప్రపంచంలోనే భారత రైల్వే లకు గుర్తింపు తీసుకురావడమే కాకుండా దేశంలోనే మొట్టమొదటిసారిగా రైల్వే వ్యవస్థను హైదరాబాద్ తెలంగాణ ప్రాంతంలో రైల్వే రవాణా రంగాన్ని, మొట్టమొదట విమాన ప్రయాణాలు ఓరుగల్లులో ప్రవేశపెట్టిన నిజాంల దూరదృష్టి పాలనను మనం అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా ప్రజల విద్య, ఆరోగ్యాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపి హైదరాబాదులో ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాం కళాశాల, ఉస్మానియా దవాఖాన, సాలార్జంగ్ మ్యూజియం, ఎర్రగడ్డ మానసిక వైద్యశాల, పంజాగుట్ట లోని నిజాం ఆర్థోపెటిక్ దవాఖాన, గర్భిణీ మహిళల సుఖ ప్రసనాలకు నయాపూల్ పక్కన జడ్జిఖాన్ దవాఖాన, యునాని, ఆయుర్వేదిక్ వైద్యశాలలు, రూపాయి నాణాలను తయారు చేసే మింట్ కాంపౌండ్, రాజేందర్ నగర్ లోని జూపార్క్, ప్రపంచానికే తలమానికమైన హైదరాబాదుకు గుర్తింపు తెచ్చిన " చార్మినారు" చారిత్రాత్మక కట్టడాలు, రవాణా రంగానికి రోడ్ల సౌకర్యం ఏర్పాటు చేయడం, జాతీయ రహదారి ఇప్పుడున్న 65ను అప్పట్లోనే అభివృద్ధి పరచడం హైదరాబాద్ సంస్థానము పరిపాలించిన నిజాం నవాబుల కాలంలోనే ఈ రంగాలన్నీ వృద్ధి చెందాయని గుర్తించక తప్పదు. మహిళల అలంకరణకు సంబంధించి విశ్వంలోనే గుర్తింపు తెచ్చిన పాతబస్తీ చార్మినార్ పక్కనే ఉన్న "చుడీ బజార్" అటు పక్కనే ఉన్న ముత్యాల వ్యాపారాలు, దేశ, విదేశాలలో ముస్లింలు ధరించే పేరెన్నికగన్న "షేర్వానీల సంప్రదాయం "మన హైదరాబాదుదే అని మర్చిపోకూడదు.
"ఇత్తర్" సుగంధ పరిమళాలు ప్రపంచంలో వెదజల్లిన వాసనలు కూడా నిజాంల చలువే!!! అని గుర్తు చేయక

..మిగతా 2లో



# భారీగా పెరిగిన ఆయిల్ పాం గెలల ధర

టన్ను ధర రూ. 17,04కు చేరిక

దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం సుంకం విధింపు ఫలితం

రెండేళ్లు గా తీవ్ర వడిదుడుకులు తరువాత ఊరట.

గత కేసీఆర్ ప్రభుత్వ కృషి తో పెరిగిన పంట విస్తీర్ణం.

రాష్ట్రవ్యాప్తం గా 2.03లక్షల ఎకారాల్లో సాగు

ఇందులో ఉమ్మడి జిల్లాలో 80వేల ఎకరాలు

3

వరద నష్టం పనులకు

# రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

రాష్ట్ర పునర్విభజన సమస్యలు పరిష్కరించండి..

ఎల్‌డబ్ల్యూఈలో ఆ మూడు జిల్లాలను తిరిగి చేర్చండి...

ఐపీఎస్ అధికారుల సంఖ్యను పెంచండి..


అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి



న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు): ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ బిజీ బిజీగా గడుపుతున్నారు. రాష్ట్ర అభివృద్ధి పనులు, పెండింగ్ నిధులకు సంబంధించిన విషయాలపై డిస్కస్ చేసేందుకు వరుసగా కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. ఇందులో భాగంగానే కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోన్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు నిధులు కేటాయించాలని కేంద్రమంత్రికి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మూసీ ప్రక్షాళన, మూసీ సుందరీకరణకు సంబంధించిన వివరాలను ఖట్టర్‌కు వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తికి కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్

..మిగతా 2లో

# సింగరేణి తెలంగాణకే తలమానికం



బోనస్ చెక్కులు పంపిణీలో భట్టి విక్రమార్క

హైదరాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు): సింగరేణి తెలంగాణ రాష్ట్రానికే తలమానికమైన సంస్థ. సింగరేణిపై ఆధారపడి ఎన్నో వేల కుటుంబాలు జీవిస్తున్నాయి. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపేర్కొన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో సింగరేణి కార్మికులకు దసరా బోనస్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 2023-24 ఏడాదిలో సింగరేణి లాభం రూ.4,701 కోట్లు నమోదయ్యింది. సింగరేణి కార్మికులకు సంతోషంగా బోనస్

..మిగతా 2లో



# రైతుల పట్ల మా చిత్తశుద్ధి ఏమిటో నిరూపించాం

ప్రధానికి లేఖ రాసిన సీఎం రేవంత్

సంక్షేమానికి కలసి రావాలని వినతి

హైదరాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన రుణమాఫీపై ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పికొడుతూ..సిఎం రేవంత్ రెడ్డి వివరణాత్మక లేఖను రాసారు. 9 నెలలుగా తెలంగాణలో అమలు చేసిన పథకాలు, ప్రజలకు చేసిన మేలును వివరిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. గత కొన్ని రోజులుగా తెలంగాణతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను టార్గెట్ చేసుకొని ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతున్నారు. అధికారంలోకి రావడానికి అనేక ఉచిత హామీలు ప్రకటిస్తున్న కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మర్చిపోతుందని విమర్శలు చేస్తున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానా ఎన్నికల ప్రచారంలో విమర్శలు చేస్తూ వచ్చారు. తాజాగా మహారాష్ట్రలో కూడా ఇదే విధమైన విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉండటంతో ప్రధానమంత్రి చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా రియాక్ట్ అయ్యారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు చేసిన పనులను వివరిస్తూ లేఖ రాశారు. కాంగ్రెస్ గ్యారెంటీలు అంటే గోల్డెన్ గ్యారెంటీలుగా ప్రజలు విశ్వసిస్తున్నారని ప్రధానికి వివరించారు. ఆ వివరాలను ఎక్స్ సోషల్ మీడియా అకౌంట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్టు చేశారు.తులను కాంగ్రెస్ పార్టీ

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# సింగరేణి తెలంగాణకే తలమానికం

మొదటి పేజీ తరువాయి...

ప్రకటిస్తున్నారు. సింగరేణి కార్మికులకు రూ.796 కోట్లు బోనస్‌గా ప్రకటించాం. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు బోనస్ వస్తుంది. సింగరేణిలో శాశ్వత ఉద్యోగులు 41,837. సింగరేణిలో ఒప్పంద ఉద్యోగులకు కూడా బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున సింగరేణి కార్మికులకు అవసరమైన అన్ని సదుపాయాలను ఏర్పాటుచేస్తామని ఆయన తెలిపారు.సింగరేణి కార్మికులకు బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రజాభవన్‌లో జరిగింది. కార్మికులకు రూ. 796 కోట్ల బోనస్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు హాజరయ్యారు. 2023–24 సంవత్సరానికి సింగరేణికి రూ.2,412 కోట్ల లాభం వచ్చింది. లాభాల్లో 33 శాతాన్ని కార్మికులకు బోనస్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.9 లక్షలు రానుంది.ఈ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు సింగరేణి లాభాల్లో కార్మికులకు కోతపెట్టాయని అన్నారు. దాదాపు లక్ష మంది పనిచేసే సింగరేణి సంస్థను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. కార్మికులు సింగరేణి సంస్థకు ఆదాయం తీసుకువస్తున్నారని అన్నారు.'చెన్నూరు, రామగుండంలో నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేశాం. 1800కుపైగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గతంలో నియామక ప్రక్రియలో చాలా మంది ఇబ్బందులు పడ్డారు. పారదర్శకంగా ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం' అని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.


# నిజాంలు మన నవాబులు.. అందుకే మన సలాములు

మొదటి పేజీ తరువాయి...

తప్పదు. ఇదే కాకుండా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన "కోహినూర్ వజ్రం" (బ్రిటీష్ రాణి తలలో వేలాడిన కోహినూర్ వజ్రం మన హైదరాబాదుదే!!! అని గర్వంగా చెప్పుకోవచ్చు. అసలు విషయానికొస్తే నిజాంనవాబులు పరిపాలించిన తెలంగాణ ప్రాంతం మొత్తంలో చెరువులు, కుంటలు, నాలాలను, చెరువుల తూములను వృద్ధి చేయడమే కాకుండా హైదరాబాదు నగర ప్రజల దాహార్తి తీర్చడానికి, ఆహారానికి అవసరపడే, వ్యవసాయ ఉత్పత్తుల కాయగూరలు, పండ్ల తోటలను భాగ్ ల పేరిట అప్పట్లోనే ఫామ్ హౌస్ లు ఉన్నాయని గుర్తించాలి. నగర ప్రజల మంచినీటి అవసరాలు తీర్చడానికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్, హుస్సేన్ సాగర్ నిజాంసాగర్, మిరాలం ట్యాంక్, గండిపేట చెరువు వీటన్నిటిని "మూసీనదికి" అనుసంధానం చేస్తూ గొలుసుకట్టు చెరువులను వృద్ధిపరుస్తూ ఎంతో దూర దృష్టితో అట్టి నీటి రిజర్వాయర్లను వృద్ధిపరిచి, హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటి నీటి అవసరాలు తీర్చిన ఘన చరిత్ర గల పాలకులు మన నిజాం నవాబులు అని మరొక్కసారి గుర్తు చేయక తప్పదు. కాలక్రమేన తెలంగాణ ప్రాంతంలో భాషాప్రముక్త రాష్ట్రాల పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పడ్డ తర్వాత సీమాంధ్ర పెట్టుబడిదారులు దొడ్డి దారిన రాజకీయ రంగంలో ప్రవేశించి రాజకీయ అధికారాలను పొంది, తెలంగాణ ప్రాంతం పై "డేగ కన్ను" వేసి, మైనారిటీ, మెజారిటీ అంటూ అసెంబ్లీలో ముఖ్యమంత్రి పదవులు పొందుతూ తెలంగాణ ప్రాంతాన్ని ఎడారి చేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో మూసి పరివాహిక ప్రాంతాన్ని కబ్జా చేస్తూ, త్రాగునీటి అవసరాలు తీర్చే నగర చెరువులను, రిజర్వాయర్లను వదలక మూసీనది ప్రవహించే ప్రాంతాన్ని విధ్వంసం చేస్తూ, భారీ అక్రమ కట్టడాలు నిర్మించి, మూసీ నదిని కనుమరుగు చేస్తూ, రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులను కోస్తా ఆంధ్రకు తరలిస్తూ, తెలంగాణ ప్రాంతానికి వివక్షత చూపుతూ, ఆంధ్ర పెత్తందారి వలస నాయకులు పాలన సాగిస్తున్న రోజులు అవి. ఇది గ్రహించిన తెలంగాణ సమాజం ఒక్కసారిగా ఉలిక్కిపడి, తమ పాలనను తామే పాలించుకుంటామని, మాకు ప్రత్యేక రాష్ట్రమే!!! శరణ్యమని!! ఉద్యమిస్తూ ఆత్మ బలిదానాలు చేసుకుంటూ " మా నిధులు మాకే, మా ఉద్యోగాలు మాకే, మా నీళ్ళు మాకే" అనే ట్యాగ్ లైన్ తో తెలంగాణ సమాజం మొత్తం అన్ని వర్గాల జేఏసీలు ఏర్పాటు చేసుకొని సకల జనుల సమ్మె, మిలీనియం మార్చ్ లతో ఢిల్లీలో ఉన్న కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడం జరిగింది. అప్పటి ఆ సకల జనుల ఉద్యమంలో నాయకత్వం వహించిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు, ఆట పాటలతో ప్రజలను ఉత్తేజపరిచిన యుద్ధనౌక గద్దర్, జేఏసీ చైర్మన్ కోదండరాం, వామపక్ష మేధావులు, అరుణోదయ కళాకారుల బృందాలు విమలక్క ఆధ్వర్యంలో నిర్వహించిన " ధూమ్ ధామ్ " కార్యక్రమాలు గుర్తించక తప్పదు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర రావును



నిజాం నవాబులు విద్య అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసి, చెక్కు చెదరని పాలరాతి కట్టడంతో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ భవనం



ప్రపంచంలోనే హైదరాబాద్ కు గుర్తింపు తెచ్చే నిజాం నవాబులు 400 సంవత్సరాలు క్రితం కట్టించిన, చారిత్రాత్మక కట్టడం మన చార్మినార్, మన గుర్తింపు!

అప్పటి టీఆర్ఎస్ ఇప్పటి బి.ఆర్.ఎస్ పార్టీకి తెలంగాణ ప్రజలు బ్రహ్మరథం పడుతూ, గంపగుత్తగా ఓట్లు వేసి కెసిఆర్ ను ముఖ్యమంత్రి చేసుకోవడం జరిగింది. రెండు పర్యాయాలు 10 సంవత్సరాలు ఏకధాటిగా కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉంటూ తెలంగాణలో మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం, కనెక్టివిటీ రోడ్లు, 24 గంటలు కరెంటు, రైతన్నలకు రైతుబంధు, షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి లాంటి అభివృద్ధి పనులు చేయలేదని అనలేము. ఎందుకో గాని హైదరాబాద్ "మూసీనది ప్రక్షాళన పై" సంపూర్తిగా కెసిఆర్ దృష్టి పెట్టలేదు. కెసిఆర్ కొడుకు కేటీఆర్ దుందుడుకు చర్యలు, ప్రజలలో కేటీఆర్ సినిమా తారలతో రాసలీలల ప్రచారం, కూతురు కల్వకుంట్ల కవిత దేశంలోనే సంచలమైన ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసులో ప్రధాన సూత్రధారి గా ఉండడం, దాదాపు ఆరు నెలలు జైలు జీవితం గడపడం, తెలంగాణ బతుకమ్మను ఢిల్లీ చీఫ్ లిక్కర్ కేసులో తాకట్టు పెట్టిందని సరిగ్గా అసెంబ్లీ ఎన్నికల ముందు ఒకవైపు కాంగ్రెస్ ఇంకోవైపు బిజెపి పార్టీల విమర్శలకు తెలంగాణ ప్రజలు కనెక్ట్ అయ్యారు. సంతోష్ రావు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో అడ్రస్ లేని మనిషి, కేవలం కెసిఆర్ సడ్డకుని కొడుకుగా మాత్రమే తప్ప ఏ అర్హతలు లేని వ్యక్తికి రాజ్యసభకు కెసిఆర్ ఎన్నిక చేయడం కూడా ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. కెసిఆర్ ను కలవడానికి వచ్చిన ప్రజలకు, కేసిఆర్ కు పెద్ద అడ్డుగోడగా ఉండడం, అన్నీతానై, అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ కు తమ సమస్యలను చెప్పుకోవడానికి అవకాశం లేకుండా సంతోష్ రావ్ అడ్డుపడడం, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడానికి ఇదొక బలమైన కారణంగా చూడాలి, ఎమ్మెల్యేలకు, మంత్రులకు, ప్రజలకు తెలంగాణ మేధావులను కలవనీయక పోవడంతో కల్వకుంట్ల కుటుంబ పాలనపై ప్రజలలో అసంతృప్తికి దారితీసింది. వినోద్ రావు ఎంపీగా ఉంటూ కల్వకుంట్ల కుటుంబాల వెలమలకు ప్రతినిధిగా పనిచేస్తూ అన్ని రంగాలలో వెలమల కులానికే పెద్దపీట వేస్తూ, ప్రణాళిక సంఘం అధ్యక్షుడిగా ఒక వర్గం వారిని ప్రోత్సహిస్తూ, ఉండడం గత అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు అర్థమయ్యేటట్టు కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు విమర్శలు గుప్పరించడం కూడా బి ఆర్ ఎస్ పార్టీ, కెసిఆర్ ఓడిపోవడానికి ఇంకొక కారణంగా చూడాలి. బిఆర్ఎస్ పార్టీ క్యాడర్లో హరీష్ రావుకు మంచి పేరు ఉన్నప్పటికీ!! హరీష్ రావే తర్వాత పార్టీలో పెద్ద దిక్కు అనుకుంటున్న సందర్భంలో అన్ని తెలిసి కూడా హరీష్ రావు నోరు తెరవక మౌనంగా ఉండడం కూడా పార్టీ డ్యామేజ్ కి కారణంగా చూడాలని బి ఆర్ ఎస్ పార్టీ పెద్దలు అంటుండడం కొసమెరుపు. ఇప్పటికైనా బి ఆర్ ఎస్ పార్టీ పగ్గాలను హరీష్ రావుకు అప్పగిస్తే పార్టీకి పూర్వ వైభవం రావడమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి తీసుకువచ్చే సత్తా ఉన్న నాయకుడు హరీష్ రావు అని పార్టీ క్యాడర్లో బలమైన అభిప్రాయం ఉన్నదన్న సంగతి పార్టీ పెద్దలు ఎంత తొందరగా గమనిస్తే అంత పార్టీకి మేలు జరుగుతుంది. ఇప్పటివరకు అంత గతం, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన విజన్ పై!!! అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు ఆరు గ్యారంటీల పేరుతో ఎన్నికల ప్రచార సభలలో కెసిఆర్ కుటుంబ పాలనపై, వారి భూ,బాగోతాల అవినీతిపై పెద్ద ఎత్తున విరుచుకుపడి, ప్రజలను ఉత్తేజపరిచి, ప్రజల ఓట్లను కాంగ్రెస్ వైపు మరుల్చుకోవడంలో అప్పటి పిసిసి అధ్యక్షుడిగా సఫలీకృతం అయ్యాడని చెప్పడంలో సీఎం రేవంత్ రెడ్డి సక్సెస్ అయ్యాడు. పిసిసి అధ్యక్షుడిగా అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి, ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన నిమిషంతోనే దూకుడుగా ముందుకు వెళ్తూ, గత కెసిఆర్ ప్రభుత్వ, అవినీతి భూ, బాగోతాల అవినీతి పై ప్రజల ముందు పెడుతూ పాలన సాగిస్తున్న సందర్భం చూస్తున్నాం. అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో ప్రతిసారి మూసీనది ప్రక్షాళన అంటూ, తనకంటూ మూసి పరివాహిక ప్రాంతాన్ని, సుందరీకరణ చేయడమే కాకుండా, ప్రపంచ పటంలో పర్యాటక ప్రాంత హైదరాబాద్ గా తీర్చిదిద్ది కలుషితం లేని, స్వచ్ఛమైన నీటితో మూసీ నదిని ప్రక్షాళన చేస్తానని, మూసి పరివారిక ప్రాంతం తో పాటు మూసీ నదిని నమ్ముకొని ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నల్లగొండ, రామన్నపేట, భువనగిరి, ఆలేరు ,సూర్యాపేట , వలిగొండ, అమ్మనబోలు మీదుగా ప్రవహించే నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట జిల్లా రైతులకు సాగునీరు అందించే నదిగా తయారు చేస్తానని చెప్పడం హర్షించదగ్గ పరిణామం. మూసినది పరివాహిక ప్రాంతం చుట్టూ అక్రమంగా నిర్మించిన అక్రమ కట్టడాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తామని అనడమే కాకుండా, "హైడ్రాకి" సంపూర్తి చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్ తేవడం కూడా ఆహ్వానించదగ్గ పరిణామం. పుట్టపోయే ఆడ పిల్లలకు మూసి పేరు పెట్టుకునేటట్లు చేస్తానని ఎంతో ఉత్సాహంగా చెప్పుతుండడం ఆహ్వానించదగ్గ మాటలు. అందరూ సపోర్టు చేయాల్సిన సందర్భం. మూసి ప్రక్షాళన ప్రాజెక్టు తనకు ఒక విజన్ ఉన్న డ్రీమ్ ప్రాజెక్ట్ అని అనడం హర్షించదగ్గ మాటలు. తనకంటూ మూసీనది పై ఒక విజన్ ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు వింటూ ఉన్నాం. మూసి పరివాహిక ప్రాంతంలో తెలిసో!!! తెలియకో??? ఇల్లు కట్టుకున్న మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాల వారు కోల్పోతున్న కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని వారికి పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని, ప్రభుత్వపరంగా వారిని అన్ని విధాల ఆదుకుంటామని తెలపడం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలు పెట్టే ఎన్నికల బలపరీక్షకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఆసన్నమైంది. గొప్పోళ్లకు ఒక న్యాయం బీదవారికి ఇంకొక న్యాయం చేయకుండా!!! చూస్తే అదే పదివేలు అంటున్న సగటు మూసీనది పరివాహకంలో ఇల్లు కోల్పోతున్న ఆర్థికంగా బక్కచిక్కిన బడుగు, బలహీన, వర్గాల ప్రజల ఆర్తనాదాలు. మూసి ప్రక్షాళన పేరుతో ప్రజల ముందుకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అతి తొందరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల అగ్ని పరీక్షకు బలం, బలహీనతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యొక్క దృఢ సంకల్పం ఏందో వేచి చూడాలి, అంటున్న యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలు. మా ప్రభాత సూర్యుడు పత్రిక సైతం టార్చ్ లైట్ వేసుకొని ఎదురు చూస్తూనే ఉంటుంది.

# వరద నష్టం పనులకు రూ.11,713.49 కోట్లు ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి...

సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. ఖట్టర్‌తో భేటీకు ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైన తెలంగాణకు వరద సహాయం పెంచి త్వరగా అందించాలని రేవంత్ అమిత్ షాను కోరారు. దీంతో పాటు సుధీర్ఘ కాలంగా పెండింగ్?లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలను పరిష్కారించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో భారీ వర్షాలతో దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులకు రూ.11,713.49 కోట్లు సత్వరమే విడుదల చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం భేటీ అయ్యారు. తెలంగాణలో ఆగస్టు 31 నుంచి నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలు రాష్ట్రంపై తీవ్ర ప్రభావం చూపాయని సీఎం తెలిపారు. 37 మంది ప్రాణాలు కోల్పోయారని, లక్షకుపైగా పశువులు, ఇతర మూగ జీవాలు మృతిచెందాయని, 4.15 లక్షల ఎకరాల్లో పంటతో పాటు రోడ్లు, కల్వర్టులు, కాజ్‌వేలు, చెరువులు, కుంటలు, కాలువలు దెబ్బతిన్నాయని కేంద్ర మంత్రి షా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులను తాము వెంటనే చేపట్టామని వివరించారు. ఆయా పనులకు రూ.5,438 కోట్లు విడుదల చేయాలని సెప్టెంబరు రెండో తేదీన తాను లేఖ రాసిన విషయాన్ని కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. రాష్ట్రంలో పంట, ఇతర నష్టాలపై కేంద్ర బృందం పర్యటించి మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.11,713 కోట్ల మేర నష్టం వాటిల్లిందని సెప్టెంబరు 30వ తేదీన నివేదిక సమర్పించిందని సీఎం తెలిపారు. ఆ నిధులు పునరుద్ధరణ, మరమ్మతుల పనులకు ఎంతమాత్రం సరిపోవని ముఖ్యమంత్రి తెలిపారు. వాటిని ఇప్పటి వరకు విడుదల చేయనందున వెంటనే ఆ నిధులు విడుదల చేయాలని కోరారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్‌ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు రూ.416.80 కోట్లను కేంద్రం విడుదల చేసిందని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులను గతంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ పనులకు సంబంధించిన నిధులు ఉపయోగానికి ముడిపెట్టవద్దని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు సంబంధించిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే వ్యయం చేస్తామని కేంద్ర మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత (ఎల్‌డబ్ల్యూఈ) జిల్లాల నుంచి తొలగించిన ఆదిలాబాద్, మంచిర్యాల, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలను ఎల్‌డబ్ల్యూఈలో తిరిగి చేర్చాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎల్ డబ్ల్యూఈ ప్రభావిత రాష్టాలైన్ర మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతో తెలంగాణకు సరిహద్దు ఉండటంతో రాష్ట్ర భద్రతపైన మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అంతర్గత భద్రతను దృష్టిలో ఉంచుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొండవాయి, ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఆలుబాక గ్రామాల్లో సీఆర్పీఎఫ్ జేటీఎఫ్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎస్పీవోలకు చెల్లించాల్సిన నిధుల్లో కేంద్రం వాటా 60 శాతం నాలుగేళ్ల నుంచి పెండింగ్ లో ఉందని, ఆ మొత్తం రూ.18.31 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 1,065 మందిని ఎస్పీవోల్లో చేర్చుకోవడానికి నిబంధనలు సడలించాలని కోరారు. తెలంగాణ సరిహద్దుల్లోని ములుగు జిల్లా పేరూరు, ములుగు, కన్నాయిగూడెం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పలిమెల, మహ ముత్తారం, కాటారం వంటి పోలీస్ స్టేషన్లను బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పోలీస్ శాఖ కొత్తగా నియమితులైన పోలీసు సిబ్బందికి గ్రేహౌండ్స్ ద్వారా తీవ్రవాద వ్యతిరేక వ్యూహాల్లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. 2024–25 సంవత్సరంలో ఈ రకమైన శిక్షణకు అదనపు బడ్జెట్ రూ.25.59 కోట్లు అవసరమని, ఆ మొత్తాన్ని విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పోలీసు దళాలను తీర్చిదిద్దే పనులకు ఉద్దేశించిన ప్రత్యేక మౌలికవసతుల పథకం (ఎస్ఐఎస్)కు తెలంగాణకు కేవలం రూ.6.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, అవి ఏమాత్రం సరిపోవని అదనంగా రూ.23.56 కోట్లు విడుదల చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. షెడ్యూల్ 9లోని (చట్టంలోని 53, 68, 71 సెక్షన్ల ప్రకారం) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పదిలోని సంస్థల వివాదం (చట్టంలోని 75 సెక్షన్ ప్రకారం) సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ ÷–లకెయిమ్ చేసుకుంటున్నందున, వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణకు అదనంగా 29 అదనపు ఐపీఎస్ పోస్టులు కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్ర పునర్విభజన సమయంలో తెలంగాణకు కేవలం 76 మంది ఐపీఎస్ అధికారులను మాత్రమే కేటాయించారని తెలిపారు.

# తుదిదశకు మావో తీవ్రవాదం

మొదటి పేజీ తరువాయి...

తగ్గాయి. హింసాత్మక ఘటనలు నమోదయ్యే పోలీసుస్టేషన్ల సంఖ్య 465 నుంచి 171కి తగ్గింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతోనే ఇది సాధ్యమైందని అమిత్ షా పేర్కొన్నారు.హింస మార్గంలో ఏం సాధించలేమని.. జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. హింస మార్గాన్ని వీడే మావోయిస్టుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వాటిని వినియోగించుకుని ప్రజల్లోకి రావాలని మావోయిస్టుల కు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా సూచించారు. ఈ సమావేశంలో 2023, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో నక్సలిజం అంతం, అర్బన్ నక్సల్స్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మావోయిస్టు కార్యకలాపాలను కట్టడి చేయడంతో పాటు పోలీస్ సామర్థ్యాన్ని పెంపొందించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర చాలా బాగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం వికసిత భారత్ లక్ష్యంగా పని చేస్తుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే వికసిత భారత్ సాధించాలంటే గిరిజనులు, ఆదివాసీలు సైతం అందులో భాగస్వామ్యం కావాలన్నారు. ÷ూనీ ప్రభుత్వ ఫలాలు గిరిజనులు, ఆదివాసీలకు అందకుండా మావోయిస్టులు అడ్డుకుంటున్నారని కేంద్ర మంత్రి అమిత్ షా మండిపడ్డారు. రహదారులు, టవర్లు, చివరకు విద్య, వైద్యం సైతం వీరికి చేరనివ్వడం లేదన్నారు. అయితే గత కొన్నేళ్లుగా మావోయిస్టు సమస్యను ఎదుర్కొనే విషయంలో మోదీ సర్కార్ గణనీయమైన పురోగతి సాధించిందని ఆయన పేర్కొన్నారు. 2022లో తొలి సారి మావోయిస్టు హింస కారణంగా జరిగిన మరణాల సంఖ్య 100 కంటే తక్కువ నమోదయిందని వివరించారు. అలాగే మావోయిస్టుల ప్రభావిత గిరిజన ఆదివాసీ ప్రాంతాలకు ప్రభుత్వ ఫలాలు, పథకాలు సైతం వేగంగా చేరుతున్నాయని తెలిపారు. మావోయిస్టుల సమస్యను అధిగమించేందుకు బహుముఖ వ్యూహాన్ని సైతం అమలు చేస్తున్నామన్నారు. దీంతో ఈ సమస్యను చాలా సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల పోలీస్ విభాగాలు సైతం చాలా బాగా పని చేస్తున్నాయన్నారు. ఇక ఎన్‌కౌంటర్‌లలో గాయపడిన భద్రత బలగాలను త్వరితగతిన వైద్య చికిత్స అందించేందుకు హెలికాప్టర్ సేవలను వినియోగిస్తున్నామని గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో వామపక్ష తీవ్రవాదంపై పైచేయి సాధించామని హోం మంత్రి అమిత్ షా ఈ సందర్భంగా వివరించారు. ఈ సమీక్షా సమావేశానికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇక ఆంధ్రప్రదేశ్ నుంచి హోం శాఖ మంత్రి వంగలపూడి అనితతోపాటు డీజీపీ ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. అలాగే జార్ఖండ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. మరోవైపు భవిష్యత్తులో వామపక్ష తీవ్రవాదం దేశానికి ముప్పుగా పరిణమిస్తుందని కేంద్రంలోని మోదీ సర్కార్ భావిస్తుంది. ఆ క్రమంలో వామపక్ష తీవ్రవాదాన్ని అంతం చేసేందుక చర్యలు చేపట్టింది. ఆ క్రమంలో దశాబ్దాల క్రితం నేపాల్ నుంచి ఆంధప్రదేశ్ వరకు పశుపతి టూ తిరుపతి కారిడార్ ఏర్పాటు చేసేందుకు మావోయిస్టులు ఉపక్రమించారు. అయితే దీనిని సైతం మోదీ సర్కార్ ధ్వంసం చేసిన విషయాన్ని ఇటీవల కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇంకోవైపు సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు మావోయిస్టులు వార్షికోత్సవాలు జరపాలంటూ కేడర్‌కు పిలుపు నిచ్చింది. అలాంటి వేళ.. ఛత్తీస్‌గఢ్‌లో శనివారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో దాదాపు 35 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇక ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రత దళాలు ముమ్మర చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్టాల్లోక్రి వెళ్లకుండా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల వద్ద భారీగా భద్రతా దళాలను మోహరించారు. ఇక దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టిన సంగతి తెలిసిందే.

# హైదరాబాద్ సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చండి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్ సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ ను(సీఎస్ఎంపీ) అమృత్ 2.0లో చేర్చాలని లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా చేపట్టాలని కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. చారిత్రక హైదరాబాద్ నగరంలో పురాతన మురుగుశుద్ధి వ్యవస్థనే ఉందని, అది ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా లేదని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. హైదరాబాద్ సమీప పురపాలక సంఘాల్లోనూ సరైన మురుగు నీటి పారుదల వ్యవస్థ లేదని కేంద్ర మంత్రి దృష్టికి ఆయన తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో ప్రజల జీవన ప్రమాణాలు ప్రపంచ స్థాయి నగరంలో మాదిరి ఉండాలంటే నగరంతో పాటు సమీప మున్సిపాలిటీల్లో 100 శాతం ద్రవ వ్యర్థాల శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు వివరించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు సమీప 27 పురపాలక సంఘాలతో కలుపుకొని కలిపి 7,444 కి.మీ.మేర రూ.17,212.69 కోట్లతో సీఎస్ఎంపీకి డీపీఆర్ రూపొందించినట్లు ఖట్టర్‌కు సీఎం తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. సీఎస్ఎంపీని అమృత్ 2.0లో చేర్చి ఆర్థిక సహాయం చేయడం లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా గుర్తించి నిధులివ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. హైదరాబాద్ నగరంలో 55 కి.మీ. మేర మూసీ నది ప్రవహిస్తోందని, ఇరువైపులా కలిపి 110 కి.మీ.మేర నగరంలోని మురుగు అంతా మూసీలోనే చేరుతోందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇలా మురుగు మూసీలో చేరకుండా ఉండేందుకు ట్రంక్ సీవర్స్ మెయిన్స్, లార్జ్ సైజ్ బాక్స్ డ్రెయిన్స్, కొత్త సీవరేజీ ట్రీట్‌మెంట్ ఎ÷–లాంట్ల నిర్మాణానికి రూ.4 వేల కోట్లతో డీపీఆర్ రూపొందించినట్లు కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలిపారు. ఆ డీపీఆర్‌ను కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సమర్పించారు. ఆ డీపీఆర్‌ను ఆమోదించడంతో పాటు పనుల అనుమతికి చొరవ చూపాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించి నాగోల్–శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 కి.మీ.), ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్–పటాన్‌చెరు (13.4 కి.మీ.), ఎల్‌బీ నగర్–హయత్ నగర్ (7.1 కి.మీ.) మొత్తం 76.4 కి.మీ. మేర డీపీఆర్‌లు పూర్తయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 వ్యయం అవుతుందని అంచనా వేశామని, దీనిని కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం 50:50 రేషియోలో జాయింట్ వెంచర్‌గా చేపట్టాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను సమర్పిస్తామని.. అది త్వరగా కార్యరూపం దాల్చేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యమంత్రి వెంట నల్గొండ, భువనగిరి, పెద్దపల్లి ఎంపీలు రఘువీర్ రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, జి.వంశీకృష్ణ, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

# రైతుల పట్ల మా చిత్తశుద్ధి ఏమిటో నిరూపించాం

మొదటి పేజీ తరువాయి...

హామీల పేరుతో నిలువునా మోసం చేసిందన్న ప్రధానమంత్రి విమర్శలను రేవంత్ రెడ్డి తిప్పికొట్టారు. ఇచ్చిన మాట ప్రకారం 22,22,067 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసినట్టు వివరించారు. రైతుల ఖాతాల్లో 17,869.22 కోట్లు రూపాయలు వేసినట్టు గుర్తు చేశారు. 2 లక్షల రూపాయల కంటే ఎక్కువ రుణం ఉన్న వారిని కూడా పరిగణలోకి తీసుకుంటున్నట్టు వెల్లడించారు. వారి త్వరలోనే రుణమాఫీ చేయబోతున్నట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కో హామీ అమలు చేస్తూ వస్తున్నామని వివరించారు. రుణమాఫీ విషయంలో కూడా కట్టుబడి మొదటి విడత రుణమాఫీని జులై 18న చేసినట్టు పేర్కొన్నారు. మొదటి విడతలో 11,34,412 మంది రైతుల ఖాతాల్లో 6034.97కోట్ల రూపాయలను వేశామని తెలిపారు. రెండో విడత కింద 6190.01 కోట్లు జమ చేశామని వివరించారు. ఆగస్టు 15న మూడో విడత 5644.24 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని గుర్తు చేశారు రేవంత్ రెడ్డి. అంకిత భావంతో వాళ్లకు ఇచ్చిన ప్రతి మాట అమలు చేస్తున్నామని తెలిపారు. వారిపై అప్పుల ఒత్తిడి లేకుండా చేయడమే ధ్యేయంగా పాలసీలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణలో రైతుల సంక్షేమాన్ని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు మీ సహాయ సహకారాలు కావాలని ప్రధానమంత్రికి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇద్దరం కలిసి వారిలో ఆత్మవిశ్వాసం పెంపొదించే ప్రయత్నాలు చేద్దామని పిలుపునిచ్చారు. తాము రైతులకు ఏం చేశామో అన్నీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అవే తమ చిత్తశుద్ధిని తెలియజేస్తాయని పేర్కొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com




# ఎన్టీఆర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ఓపినింగ్ ఎన్నడూ


**కల్లూరు - ప్రభాత సూర్యుడు** మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీ ఎన్టీఆర్ కాలనీ లో గల కమ్యూనిటీ హాల్ ని గత ప్రభుత్వం హాయాంలో మంజూరు అయినటువంటి ఈ కమ్యూనిటీ హాల్ ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ఓపినింగ్ కీ సిద్ధంఅయ్యింది. అయినా ఇంకా ఓపినింగ్ కీ నోచుకోని కమ్యూనిటీ హాల్.సంబంధించిన అధికారులు ఈ కమ్యూనిటీ హాల్ ను ఓపినింగ్ చేయించి ఎన్టీఆర్ కాలనీ కీ అంకితం చెసి ఎన్టీఆర్ కాలనీ వాసులు కీ వాడుకలోకి తీసుకోని రావాలి అనీ ప్రజలు కోరుకుంటున్నారు.

# భారీగా పెరిగిన ఆయిల్ పాం గెలల ధర

**టన్ను ధర రూ. 17,04కు చేరిక**
**దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం సుంకం విధింపు ఫలితం**
**రెండేళ్లు గా తీవ్ర వడిదుడుకులు తరువాత ఊరట.**
**గత కేసీఆర్ ప్రభుత్వ కృషితో పెరిగిన పంట విస్తీర్ణం**
**రాష్ట్రవ్యాప్తంగా 2.03లక్షల ఎకారాల్లో సాగు**
**ఇందులో ఉమ్మడి జిల్లాలో 80వేల ఎకరాలు**



**సత్తుపల్లి -ప్రభాత సూర్యుడు:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో అయిల్ పాం రైతులు రెండేళ్లుగా కనీస గిట్టుబాటు ధరలేక ఒడుదుడుకులు ఎదుర్కొంటున్న ఆయిల్‌పాం రైతులు ఇప్పుడిప్పుడే ఖుషీ అవుతున్నారు. క్రూడాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం సుంకం విధించడంతో ఒక్కసారిగా గెలల ధర భారీగా పెరిగింది. ఫలితంగా ఆయిల్‌పాం సాగు విస్తరణ కూడా పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయిల్‌ఫెడ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఉక్రెయిన్ - రష్యా దేశాల యుద్ధం కారణంగా పామాయిల్ దిగుమతులు నిలిచిపోవడంతో ఇక్కడి గెలల ధర అనూహ్యంగా రూ.23 వేలు దాటిపోయింది.



తర్వాత దిగుమతి సుంకం ఎత్తివేయడంతో దశల వారీగా గెలల ధర పడిపోయింది. అప్పటి నుంచి గిట్టుబాటు ధరలేక ఆయిల్‌పాం రైతులు ఆర్థికంగా ఒడుదుడుకులు ఎదుర్కొన్నారు. రైతు సంఘాల వినతికి స్పందించిన కేంద్రం.. దిగుమతులపై మళ్లీ సుంకం విధించడంతో గెలల ధర భారీగా పెరిగింది. రూ.2,651 మేర పెరిగి టన్ను ధర రూ.17,043కు చేరింది. పెరిగిన ధరతో రైతులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీర్ఘకాలిక నికర ఆదాయం అందించే ఆయిల్‌పాంపై అధికశాతం మంది రైతులు ఆసక్తి పెంచుకుని సాగు చేస్తున్నారు. దళారులు లేకుండా పండించిన పంటను నేరుగా ఆయిల్‌ఫెడ్ కొనుగోలు చేసి ముందుగా ప్రకటించిన ధరను రోజుల వ్యవధిలోనే చెల్లిస్తుండడంతో సాగు కూడా అమాంతం పెరిగింది. పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, రైతులకు ఆర్థిక భరోసా వంటివి లభించడంతో గత కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లోనే రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తరణకు ప్రణాళికను చేపట్టింది. 10 లక్షల ఎకరాల్లో సాగు పెంపు లక్ష్యంగా హైదరాబాద్, రంగారెడ్డి మినహా ఆయిల్‌ఫెడ్‌కు ఎనిమిది జిల్లాలను, మిగతా 23 జిల్లాలను 12 ప్రైవేట్ కంపెనీలను కేటాయించింది. కేవలం ఉమ్మడి ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయిల్‌పాం సాగు గత కేసీఆర్ సర్కార్ ముందుచూపుతో రాష్ట్రంలో భారీగా విస్తరించింది. ఇప్పుడు రాష్ట్రంలో సుమారు 2.03 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. కేవలం ఉమ్మడి జిల్లాలోనే సుమారు 80 వేల ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు.

### రూ.17,043కు పెరిగిన గెలల ధర

రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో మాత్రమే ఆయిల్‌పాం గెలల ధర రూ.23 వేలు దాటింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ఎత్తివేయడంతో ధర పతనం దిశగా వెళ్లింది. దీంతో గడిచిన రెండేళ్లలో టన్ను గెలల ధర రూ.14,500 వేలు కూడా దాటలేదు. రూ.12 వేల నుంచి రూ.14,500 వేల మధ్య దోబూచులాడింది. దీంతో రైతులు తోటల నిర్వహణ గిట్టుబాటుగాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీని ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా సాగు విస్తరించాలన్న సర్కారు లక్ష్యంగా నెమ్మదించింది. టన్ను ధర రూ.23 వేలు దాటినప్పుడు తోటల నిర్వహణ, పెరిగిన కూలీల వ్యయం తగ్గకపోవడం వంటి కారణాలతో ఆర్థిక సమస్యలు ఎదురయ్యాయి.

అప్పటి నుంచి కనీసం టన్ను ధర రూ.20 వేలు ఉండాలని రైతులు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈ దశలోనే ఖమ్మం పర్యటనకు వచ్చిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో రైతు సంఘం నాయకులు కలిసి సమస్యను విన్నవించారు. ఇందుకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. దిగుమతి సుంకాన్ని 20 శాతం, ఇతర పన్నులను 7.5 శాతం కలిపి మొత్తం 27.5 శాతాన్ని విధించడంతో గెలల ధర అదనంగా రూ.2,651కు పెరిగింది. దీంతో టన్ను ధర అమాంతం రూ.17,043కు చేరింది. దీంతో పామాయిల్ రైతులు ఖుషీఖుషీ అవుతున్నారు.

### గెలల ధర రూ.2,651 పెరిగింది..



రైతులు ఆశించిన స్థాయిలో ఆయిల్‌పాం గెలల ధర భారీగా పెరిగింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం విధించడంతో ప్రస్తుతం ఉన్న టన్నుల గెలల ధర రూ.14,392 నుంచి రూ.17,043కు చేరింది. ఈ ధర ఆయిల్‌పాం రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది. రైతులకు దీర్ఘకాలం నికర ఆదాయం అందించే ఆయిల్‌పాం సాగుతోనే భవిష్యత్‌కు భరోసా ఉంటుంది. ఈ దశగా ఇతర రైతులు ఆలోచన చేసి ఆయిల్‌పాం సాగు వైపు దృష్టి సారించాలి అని ఆకుల బాలకృష్ణ, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ కోరినారు.



## మింగ మెతుకు లేదు.. మీసాలకు సంపెంగ నూనె

**రేవంత్ పాలన తీరుపై కెటిఆర్ విమర్శలు**

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** మింగమెతుకు లేదు మీసాలకు సంపెంగ నూనె అన్న చందంగా రేవంత్ పాలన సాగుతోంది. కెటిఆర్ఎ ఎక్స్ వేదికగా విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి పది నెలలు అవుతున్నా.. ఒక్క సంక్షేమ, అభివృద్ధి పథకం అమలుకు నోచుకోలేదు. రేవంత్ రెడ్డి పరిపాలన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏ ఒక్క వర్గానికి కూడా ఇప్పటి వరకు ఒక్క సంక్షేమ పథకం అందలేదు. ఈ క్రమంలో రేవంత్ సర్కార్‌పై రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో రేవంత్ సర్కార్ పరిపాలనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. మింగ మెతుకు లేదు.. కానీ మీసాలకు మాత్రం సంపెంగ నూనె కావాలె అన్నట్టునది రేవంత్ వైఖరి అని కేటీఆర్ విమర్శించారు. తెల్లారి లేస్తే బీద అరుపులు. రాష్ట్రం అప్పుల పాలైంది అని, డబ్బులు లేవని. మరొకవైపు మూసీ పేరిట ఈ లక్ష యాభై వేల కోట్ల సోకులు, ఆర్భాటం ఎవరికోసం? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా రేవంత్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కేటీఆర్ మరోసారి గుర్తు చేశారు.

## పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదు

**సచివాలయం కూల్చేస్తారా అంటూ ప్రశ్న**
**హైడ్రా కూల్చివేతలపై అసద్ ఆగ్రహం**



**నిజామాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** హైడ్రా కూల్చివేతలపై ఎంఐఎం చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మరోసారి ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. కొన్ని ప్రభుత్వ భవనాలను ఎఫ్‌టీఎల్‌లో కట్టారు.. వాటిని కూల్చేస్తారా అని ప్రశ్నించారు. నెక్లెస్ రోడ్డు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉంది తొలగిస్తారా అన్నారు. జీహెచ్ఎంసీ ఆఫీస్, సెక్రటేరియట్, ప్రముఖుల ఘాట్‌లు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. వాటిని కూడా కూల్చేస్తారా అంటూ ÷ర్ అయ్యారు. ఎవ్వరు అడ్డొచ్చిన మూసీ సుందరీకరణ ఆగదంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం సర్వత్రా చర్చనీయాంశం అయింది. నిజామాబాద్ నగరంలోని ఖిల్లారోడ్‌లో నిర్వహించిన సభలో అసదుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాల తొలగింపులో పేదలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కాంగ్రెస్ హామీల్లో పేదల సంక్షేమం ఉందని మర్చిపోవద్దని చెప్పారు. సెక్రటేరియట్‌తో పాటు బాపు ఘాట్ ఇలా మరెన్నో ప్రముఖ కట్టడాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయన్నారు. రాష్ట్ర పరిపాలన విభాగం ఎఫ్‌టీఎల్‌లో ఉన్నప్పుడు లేని ఇబ్బంది పేదల ఇండ్లు ఉంటే ఇబ్బంది ఏమిటని అని ప్రశ్నించారు. అభివృద్ధికి తాము మద్దతు ఇస్తామని, కానీ పేదలు ఇబ్బందులు పెట్టొద్దని సూచించారు. ప్రధాని మోడీ పాలనలో ముస్లిం మైనార్టీలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ఆయన ప్రసంగాలు వినే ఉద్దేశం లేకనే తాను పార్లమెంటుకు వెళ్లలేదని చెప్పారు. గుజరాత్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఒక్క ముస్లిం ఎంపీ లేరని గుర్తుచేశారు. బీజేపీ ప్రభుత్వం ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ కనుసన్నల్లో నడుస్తుందని అన్నారు. ముస్లింలకు వ్యతిరేకంగా ట్రిబుల్ తలాక్, సీఏఏ లాంటి చట్టాలు తెచ్చారని విమర్శించారు. వక్ఫ్ బోర్డు విషయంలో బీజేపీ అసత్య ప్రచారాలు చేస్తుందన్నారు. మహారాష్ట్ర, కశ్మీర్, హర్యానాలో ఆ పార్టీ ఓటమి ఖాయమన్నారు.

## వానరాలపై విషప్రయోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**సత్తుపల్లి-ప్రభాత సూర్యుడు :** మండల పరిధిలోని కిష్టారం కూడలి వద్ద గల లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద పదుల సంఖ్యలో వానరాలు అనుమానాస్పద స్థితిలో ముత్యువాత పడ్డాయి. మరణించిన వానరాల ను లారీ ఆఫీస్ లో పనిచేసే సైదులు అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చిపెట్టాడు. కిస్టారం గ్రామ పంచాయతీ సిబ్బంది సైతం విషయం బయటకు రాకుండా పరిసరాలను శుభ్రపరిచారు. విషయం తెలిసి బీజేపీ నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో విగతజీవులుగా పడివున్న వానరాలు చూసి చలించిపోయారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర రావు మాట్లాడుతూ ఇంతపెద్ద సంఖ్యలో వానరాలు విషప్రయోగం జరగటం చాలా నీచమైన హేయమైన చర్య అని. ఇప్పటికే విషాహారం వందల సంఖ్యలో వానరాలు తిన్నాయి అని వెంటనే ఆయకోతులకు విరుగుడు మందులు వేయాలని వెటర్నరీ డిపార్ట్మెంట్ ను డిమాండ్ చేశారు. సంఘటనా స్థలం నుంచే జిల్లా అటవీ అధికారితో ఫోన్ ద్వారా సమాచారం తెలిపారు. దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి పీఏస్ లో పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిశ్రా, నియోజకవర్గ కన్వీనర్ భస్కర్ని వీరం రాజు,మండల అధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు ఆచంట నాగస్వామి, మందా శివా, మెరుగు శేషగిరి రావు, గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.









## దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు


### ఉల్లి, టమాటా ధరల మోత

హైదరాబాద్,అక్టోబర్7(ఆర్ఎన్ఎ):సామాన్య జనాలకు కూరగాయల ధరలు షాకిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇందులో ముఖ్యంగా టమాటా కొండెక్కి కూర్చుంది. మార్కెట్‌లో టమాటా ధర రూ.100 పలుకుంది. హోల్‌సేల్ మార్కెట్లు, మండీలలో టమాటా రూ.80 నుంచి రూ.90 వరకు ఉంది. ఇక, ఉల్లిగడ్డ ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో ఉల్లి ధర రూ.80కి చేరింది. అలాగే, కిలో బెండకాయలు రూ.70, బీన్స్ రూ.100, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.70 చొప్పున మార్కెట్లలో విక్రయిస్తున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతోనే ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. సామాన్య ప్రజలు మాత్రం..కూరగాయల ధరలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే వర్షాల ప్రభావంతో టమాట ధరలు భారీగా పెరుగుతున్నాయి. నెలన్నర క్రితం వరకు కిలో రూ.20 నుంచి రూ.30 పలికిన ధర ఇప్పుడు రూ.100కు చేరువవుతోంది. ప్రస్తుతం రైతుబజార్లు, హోల్‌సేల్‌లో కిలో టమాట ధర రూ.60-80 ఉండగా.. రిటైల్ మార్కెట్‌లో రూ.100కు చేరువైంది. డిమాండ్‌కు సరిపడా టమాట రాకపోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాట పంట దెబ్బతిందని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు. సాధారణంగా ఈ సమయంలో టమాట ధరలు తగ్గి.. వేసవిలో పెరుగుతాయి. వర్ష ప్రభావంతో ప్రస్తుతం ధరలు పెరిగాయని, కొత్త పంట చేతికొచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉల్లి ధర సైతం భారీగా పెరిగింది. రైతుబజార్లలో కిలో రూ.50 చొప్పున విక్రయిస్తుండగా.. రిటైల్, ఇతర మార్కెట్లలో రూ.60-70కి తగ్గడంలేదు. రిటైల్‌మార్కెట్లలో కిలో బెండకాయలు రూ.70, బీన్స్ రూ.100, దొండ రూ.60, క్యాప్సికం రూ.80, బీరకాయ రూ.70 చొప్పున విక్రయిస్తున్నారు.





RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



# జానీ మాస్టర్‌కు అత్యవసర బెయిల్

## రద్దు చేయాలంటూ పోలీసుల పిటిషన్

**హైదరాబాద్, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** అత్యాచారం కేసులో నిందితుడిగా ఉన్న కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ మధ్యంతర బెయిల్ రద్దు చేయాలని పోలీసులు కోర్టును కోరనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు. జానీ మాస్టర్ జాతీయ అవార్డు తీసుకునేందుకు ఈ నెల 6 నుంచి 9 వరకు మధ్యంతర బెయిల్‌ను ఇటీవల కోర్టు మంజూరు చేసింది. ఆయనకు అవార్డును తాత్కాలికంగా నిలిపివేసిన దృష్ట్యా బెయిల్ రద్దు చేయాలని పోలీసులు పిటిషన్ వేయనున్నారు. 2022 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా జానీ మాస్టర్ ఎంపికయ్యారు. ఈ నెల 8న దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో పురస్కారం అందుకోవాల్సి ఉంది. అయితే తనపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు ఓ సహాయ నృత్య దర్శకురాలు ఆయనపై ఇటీవల నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు కావడంతో అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఈ అభియోగాల నేపథ్యంలో ఆయనకు ప్రకటించిన అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు, ఆహ్వానపత్రికను రద్దు చేస్తున్నట్లు నేషనల్ ఫిల్మ్ అవార్డు సెల్ ప్రకటించింది.

# మోడీ తిరోగమన నిర్ణయాలు!



**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** దేశంలో తిరోగమన రాజకీయాలను మోడీ పట్టించుకోవడం లేదు. మోడీ గురివింద సామెతలా..తన తప్పులను పక్కన పెట్టి ఎదుటి పక్షాలను విమర్శిస్తూ పోతున్నారు. బిజెపి అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. ప్రజలను విడిచి పాలన సాగిస్తున్న ఏకైక పార్టీకి మోడీ నాయకత్వం వహిస్తున్నారు. అయితే తమకుతాము బ్రహ్మాండంగా పనిచేస్తున్నామని, మంచి పాలన అందిస్తున్నామని చంకలు గుద్దుకుంటున్నారు. ధరల పెరుగుదల, రూపాయి విలువ పడిపోవడం, పెట్రో ధరలు పెరగడం, బంగారం ధరలు పెరగడం, సిమెంట్ ధరలు పెరగడం, కూరగాయల ధరలు పెరగడం, నిత్యాసవర ధరలు పెరగడం, ఇళ్ల నిర్మాణాలు అందుబాటులో లేకపోవడం వంటివన్నీ మోడీ సాధించిన విజయాలుగా చెప్పుకోవాలి. ఇవన్నీ మరచి తెలంగాణలో రుణమాఫీ కాలేదని ఆరోపణలు చేయడం దారుణం కాక మరోటి కాదు. కరోనాలో లక్షల మంది చనిపోతే పట్టించుకోని దౌర్భాగ్యం చూశాం. చనిపోయిన కుటుంబాల లెక్కలను తక్కువ చేసిన వైనం చూశాం. మోడీ నిర్లక్ష్యం కారణంగా నిరుద్యోగం పెరుగు తోంది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. ఉన్న పరిశ్రమలను తెగనమ్ముతున్నారు. రూపాయి విలువ పడి పోవడంతో అంతర్జాతీయంగా మారకం ధరలు పెరిగాయి. వంటనూనెల ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సమ్యలే తప్ప పరిష్కార మార్గాలు కనపించడం లేదు. అందుకే మోడీ పట్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోంది. ఏదో చేస్తార్న భ్రమలు తొలగిపోతున్నాయి. పదేళ్లలో చేయలేని వారు మరో ఐదేళ్లలో చేస్తారన్న ఆశలు లేవు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతోంది. జిఎస్టీ భారం అంతా ఇంతా అని చెప్పడానికి లేదు. కాబూలీవాలా లాగా నెలకు ఎంత జిఎస్టీ వసూళ్లు పెరిగాయన్న లెక్కలు చూసుకుని మురిసి పోతున్నారు. జిఎస్టీ భారం తలకు మించి కావడంతో దానిని కట్టకుండా ఎగవేద్దామన్న ధోరణిలో వ్యాపారాలు సాగుతున్నాయి. అందుకే ఏదైనా వస్తువుతు కొనుగోలు చేస్తే జిఎస్టీతోనా...లేకుండానా అని వ్యాపారులు అడుగుతున్నారు. దీనిని గుర్తించకుండా గుడ్డిగా జిఎస్టీ అమలు చేస్తున్న తీరు ఆక్షేపణీయం. అందుకే మోడీ ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశ విధానాల కారనంగా ప్రజలు ప్రత్యమ్నాయం గురించి ఆలోచన చేస్తున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ మళ్లీ పుంజుకుంటోంది. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి 240 సీట్లు మాత్రమే ఇవ్వడం వెనక ప్రజల్లో ఉన్న ఆగ్రహావేశాలు గుర్తించడం లేదు. ఇప్పుడు హర్యానా,కాశ్మీర్‌లలో కూడా బిజెపి వ్యతిరేకత కానవస్తోంది. బీహార్‌లో కండువాలు మారుస్తున్న నితీశ్ కుమార్ తీరుపైనా వ్యతిరేకత పెరుగుతోంది. మహారాష్ట్రలోనూ వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. ప్రజలు హిందుత్వ ఒక్కటే కోరుకోవడం లేదు. దానితో పాటు బతకాడానికి అవసరమైన పరిస్థితులు కావాలని చూస్తున్నారు. అవన్నీ లేనప్పుడు హిందుత్వ అన్నం పెట్టదని పాలకులు గుర్తించాలి. ఇవన్నీ ఆసరాగా చేసుకుని విపక్షాలు ఏకమవుతున్నాయి. అలాగే ఒక్కో రాష్ట్రంలో ఉన్న పార్టీలకు తోడు కొత్త పార్టీలు పుట్టుకుని వస్తున్నాయి. బీహారా రాజకీయాలను తీసుకుంటే అక్కడ నితీశ్‌తో కలసి అధికారంలో ఉన్న బిజెపి పెద్దగా ఏమీ చేయలేకపోతున్నది. దీంతో ప్రశాంత్ కిశోర్ కొత్త పార్టీతో ఆశలు కల్పిస్తున్నారు. ప్రచారకర్తగా, సలహాదారుగా ఉన్న ప్రశాంత్ కిశోర్ ఒక రాజకీయపార్టీని ఆరంభించి బిహార్ ఎన్నికల బరిలోకి దిగారు. ఎన్నో రాజకీయపక్షాలను గద్దెనెక్కించిన తాను, ప్రజల హృదయాలను గెలవలేనా? అన్న విశ్వాసం తో అక్టోబర్ 2 గాంధీజయంతినాడు 'జన్ సురాజ్' పార్టీని ప్రకటించారు. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో, అన్ని స్థానాల్లోనూ పోటీచేసి, అధికం గెలిచి, అధికారాన్ని కైవసం చేసుకోగలనన్నది ఆయన విశ్వాసం. తనమీదతనకు అంత నమ్మకంతోపాటు, బిహార్ ప్రజలమీద ఆయనకు అంత విశ్వాసం ఉందని ప్రకటించుకున్నారు. ఇదంతా ఓ రకంగా చెప్పాలంటే నితీశ్, బిజెపి కూటమి వైఫల్యమనే చెప్పాలి. ఇప్పటికే ఉన్న నిషేధాన్ని తొలగించి మద్యాన్ని ప్రవహింపచేస్తానని ఆయన ప్రకటించాడు. అంటే ప్రజలు మద్యాన్ని కోరుకుంటున్నారు కానీ, నిషేధం కాదని గ్రహించాడు. ఓట్ల కోసం ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు అందరూ అవలంబిస్తున్నారు. బిహార్‌లో మద్యనిషేధం అమలు మీద భిన్నాభి ప్రాయాలున్నాయి. ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తన నిర్ణయం సూపర్ హిట్ అని ఎలాగూ చెప్పుకుంటారు. మహిళలు నితీశ్‌ఫోటోను ఆరాధిస్తున్నారని, నిరుపేదల కుటుంబాలు బాగుపడి, కాస్తంత దాచుకుంటు న్నాయని ఆయన పార్టీ ప్రచారం చేసుకుంటుంది. ఈ పరిస్థితుల్లో, తాను బిహార్‌లో అధికారంలోకి వచ్చిన పావుగంటలో మద్యనిషేధాన్ని ఎత్తేస్తానని, రాష్ట్రంలో కుప్పకూలిన విద్యారంగాన్ని ఉద్ధరించడానికి ఆ సొమ్మును ఖర్చుచేస్తానని పీకే ప్రకటించారు. మద్యం అమ్మకాలద్వారా వచ్చే రాబడి ఎంత, విద్యారంగాన్ని బాగుచేయడానికి ఐదేళ్ళకాలంలో ఎంతకావాలన్న జమాఖర్చులు ఆయన ప్రజలకు విప్పిచెప్పారు. బిహార్‌కు రావాల్సిన డబ్బును మోదీ తన గుజరాత్‌కు తరలించుకుపోతున్నాడని, కేంద్రం నుంచి బిహార్‌కు రావ్వాల్సినదాన్ని రాష్ట్రనేతలు సాధించడం లేదని కొన్ని విమర్శలు సైతం పీకే చేశారు. అంటే బీహార్‌కు పెద్దగా కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నది గమనించవచ్చు. అలా ఏ ఇతర రాష్ట్రానికి కూడా పెద్దగా ఖర్చు చేయడం లేదు. తెలంగాణకు దమ్మిడీ ఇవ్వడం లేదు కానీ ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. కర్నాటకలో అక్రమాలకు పాల్పడి అధికారం కోల్పోయాక ఇప్పుడు అక్కడ మళ్లీ అధికారం కోసం కుత్సిత రాజకీయాలు మొదలు పెట్టారు. ఇలాంటి రాజకీయాలను ప్రజలు ఎంతోకాలం సహించరు. ప్రజలకు మేలు చేయని నిర్ణయాలను స్వాగతించరని మోడీ ద్వయం ఎంత త్వరగా గుర్తిస్తే..దేశానికి అంత మంచిది.



# పెరుగుతున్న సిమెంట్ ధరలు

## నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** దేశంలో ఇప్పుడంతా ధరల సీజన్ నడుస్తోంది. ఏ వస్తువైనా పెరగడమే తప్ప దిగిరావడం లేదు. ఇప్పుడు ఉల్లిపాయ, టమాటా మొదలు సిమెంట్ ధరలు కూడా పెరుగుతున్నాయి. కూరగాయలకేనా..మాకు లేదా అంటూ సిమెంట్ కంపెనీలు ధరలు పెంచేస్తున్నాయి. నిర్మాణ కార్యక్రమాలు పెరగడంతో, సిమెంట్‌కు డిమాండ్ పెరిగి, సిమెంట్ ధరలు కూడా పెరిగాయి. ఈ ఏడాది, నైరుతి రుతపవనాల వల్ల దేశవ్యాప్తంగా మంచి వర్షాలు కురిశాయి. చాలా ప్రాంతాలను వరదలు చుట్టుముట్టాయి. ఆ ప్రత్యక్ష ప్రభావం నిర్మాణ కార్యకలాపాలపై పడింది. సాధారణంగానే వర్షాకాలంలో నిర్మాణ పనులు నిదానంగా సాగుతాయి. ఈ ఏడాది నైరుతి సీజన్‌లో వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల నిర్మాణాలు మరింత తగ్గి ..ఓ రకంగా చెప్పాలంటే ఆగిపోయాయి. ఇప్పుడు, మాన్‌సూన్ సీజన్ ముగియడంతో దేశంలో నిర్మాణ పనులు మళ్లీ ఊపందుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా నివాస గృహాలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, అపార్ట్ మెంట్లు, రహదారులు, కర్మాగారాలు, ప్రభుత్వ ప్రాజెక్టులు వంటివి చురుగ్గా ప్రారంభమయ్యాయి. ఫలితంగా సిమెంట్‌కు డిమాండ్ బాగా పెరిగింది. డిమాండ్ పెరిగే సరికి, సిమెంట్ కంపెనీలు రేట్లను కూడా పెంచాయి. సిమెంట్ బస్తా ధర రూ. 10 నుంచి రూ. 30 వరకు పెరిగింది. పెరిగిన రేట్లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. దీంతో, వ్యక్తిగత నివాసాల నిర్మాణం నుంచి భారీ ప్రాజెక్టుల వరకు నిర్మాణ వ్యయం పెరుగుతోంది. ఏ నిర్మాణంలోనైనా సిమెంట్‌ది కీలక పాత్ర. సిమెంటు ధర పెరగడంతో నిర్మాణ వ్యయం పెరిగే పరిస్థితి ప్రతి ఏటా కనిపిస్తోంది. వాస్తవానికి, వేసవి కాలంలో నిర్మాణ కార్యక్రమాలు పీక్ స్టేజ్‌లో జరుగుతుంటాయి. అయితే, ఈ సంవత్సరం వేసవిలో మన దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ప్రవర్తన నియమావళి అమల్లోకి రావడం, దేశవ్యాప్తంగా ఎన్నికల హడావిడి, ఆ తర్వాత వర్షాకాలం ప్రారంభం కావడంతో దేశంలో కొన్ని నెలలపాటు నిర్మాణ కార్యకలాపాలు మందగించాయి. నిర్మాణ కార్యకలాపాలు స్తబ్ధుగా మారడంతో సిమెంట్ డిమాండ్ కూడా తగ్గింది. ఇది సిమెంట్ రేట్లపై ప్రభావం చూపింది. ఫలితంగా ఈ ఏడాది ప్రథమార్థంలో సిమెంట్ బస్తా ధర పెంపును అన్ని కంపెనీలు వాయిదా వేశాయి. గత వారంలో, స్టాక్ మార్కెట్‌లో భారీ పతనంతో దాదాపు అన్ని సిమెంట్ కంపెనీలు దెబ్బతిన్నాయి. అన్ని సిమెంట్ షేర్లు శుక్రవారం నష్టాల్లో క్లోజ్ అయ్యాయి. మార్కెట్ పరిస్థితులను బట్టి ఆయా పెట్టుబడి సాధనాల్లో రాబడి మారుతుంటుంది. దీంతో సిమెంట్ ధరలు పెరిగాయి. స్టాక్ మార్కెట్లలో మళ్లీ సిమెంట్ కంపెనీల షేర్లు పెరుగుతున్నాయి.

# తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

### కల్పవృక్ష వాహన సేవలో దర్శనమిచ్చిన శ్రీవారు
### మాడవీధుల్లో ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శనలు
### నేటి గరుడోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేసిన టిడిడి





**తిరుమల, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** కలియుగదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం కల్పవృక్ష వాహన సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుమల మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్ష వాహనంపై శ్రీవారి వైభవాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. రాత్రి స్వామివారికి సర్వభూపాల వాహనసేవ జరగనుంది. మరోవైపు బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమలకు భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో గోవిందనామ స్మరణతో సప్తగిరులు మార్మోగుతున్నాయి. భక్తులు వాహన సేవలను తిలకించి భక్తిపారవశ్యంలో మునిగి తేలుతున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరువీధులు భక్తులతో నిండిపోయి. గోవింత నామస్మరణలతో మారుమోగుతున్నాయి. తిరుమల శ్రీనివాసుని నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మరోవైపు శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వివిధ కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధానంగా.. శ్రీవారికి ఘనంగా నిర్వహించే గరుడ వాహనసేన మంగళవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 11గంటల వరకు జరగనుంది. ఈ గరుడ వాహన సేవ కోసం టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. గరుడసేవను తిలకించేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తిరుపతి జిల్లా పోలీసులు, టీటీడీ భద్రతాధికారులతో కలిసి భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. దానిలో భాగంగా.. నేటి అర్థరాత్రి నుంచి కనుమ రహదారుల్లో ద్విచక్రవాహనాలను నిషేధించటంతో పాటు, కొండ కింద అలిపిరి దగ్గర వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన గరుడ సేవకు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. మాడవీధుల గ్యాలరీ రెండు లక్షల మంది భక్తులు వాహనసేవను తిలకించేందుకు వీలు ఉందని చెప్పారు. క్యూలైన్ల నుంచి మాడవీధుల కూడలికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకునేలా చర్యలు తీసుకున్నామన్నారు. భక్తులకు అన్న ప్రసాదాలు, పాలు, మజ్జిగ నిరంతరాయంగా పంపిణీ చేస్తామని వెల్లడించారు. అలాగే.. గరుడ సేవను తిలకించేందుకు మాడవీధుల్లో బయట ఉన్న భక్తులకు టీవీ స్క్రీన్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి గరుడ సేవకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశామని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. ఐదు వేల మంది పోలీసు బలగాలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గరుడ సేవ రోజున మూడున్నర లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేసినట్లు చెప్పారు. సీసీ కెమెరా నిఘాలో తిరుమల మొత్తం మానిటరింగ్ చేస్తామన్నారు. మరోవైపు.. తిరుమలలో ఎనిమిది వేల వాహనాలకు మాత్రమే పార్కింగ్ సదుపాయం ఉందని, మిగతా వాహనాలను తిరుపతిలో ఏర్పాటు చేసిన ఐదు హోల్డింగ్స్ పాయింట్స్‌లో పార్కింగ్ చేసుకొని.. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా తిరుమలకు రావాలని ఎస్పీ సుబ్బారాయుడు సూచించారు.



# తిరుమలకు భారీగా భక్తుల రాక

## దర్శనానికి 24 గంటల సమయం

తిరుమలఅక్టోబర్7(ఆర్ఎన్ఎ): తిరుమలలో జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. గోవిందానామస్మరణతో వీధులు మారుమ్రోగుతున్నాయి. కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులతో కంపార్టుమెంట్లు అన్నీ నిండిపోయి కృష్ణాతేజ గెస్ట్‌హౌజ్ వరకు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 86,859 మంది దర్శించుకోగా 37,173 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న వివిధ కానుకల ద్వారా హుండీకి రూ. 3.63 కోట్ల ఆదాయం వచ్చిందని వెల్లడించారు.

# కులగణన కొత్త రాజకీయ ట్రెండ్

## ఆర్థిక స్థితిని వదిలి కులాల కుంపట్లు
## ఇదే బాటలో ప్రశాంత్ కిశోర్ అడుగులు

**పాట్నా, అక్టోబర్ 7 (ప్రభాత సూర్యుడు):** అన్ని పార్టీలు కులగణనే ఆధారం చేసుకుని రాజకీయాలు నెరపుతున్నాయి. దేశంలో కులాల కుంపట్లు రగిల్చి రాజకీయం చేయాలన్నదే అన్ని పార్టీల ఆలోచన. ఈ విషయంలో బిజెపి మాత్రమే దీనిని వ్యతిరేకిస్తున్నారు. కులాల చిచ్చుతో దేశంలో ఐక్యత దెబ్బతింటుందని బిజెపి హెచ్చరి స్తున్నది. అయినా ఇప్పుడు కులాల ఆధారంగా వారి జీవనస్థితిగతులను, ఆర్థిక స్థితిగుతులను లెక్క వేయలేం. నిజానికి ఆర్థిక స్థితిగతులు ఆధారంగాగణన జరగాలి. పేదలు, అత్యంత పేదలను గుర్తించాలి. అలా గుర్తించి వారిని పైకి తీసుకుని వచ్చేలా ప్రణాళికలు చేయాలి. కానీ ఏ రాజకీయ పార్టీ ఇందుకు సిద్దంగా లేదు. ఇలా చేస్తే ఓట్లు రావని వారి గట్టి నమ్మకం. అందుకే కాంగ్రెస్ కులగణనపై ఆధారపడి రాజకీయాలు చేస్తోంది. నితీశ్ కుమార్ కూడా ఇదే మూసధోరణిలో పోతున్నారు. కులగణను చేపట్టాలని ఆయన ఇంతకు ముందే నిర్ణయించారు. కొత్తగా జన్ సురాజ్ పార్టీ ప్రకటించిన ప్రశాంత్ కిశోర్ కూడా దీనినే నమ్ముకున్నారు. పార్టీ వ్యవస్థాగత నిర్మాణంలోనూ, రేపు ప్రభుత్వంలోనూ ఆయా కులాల జనాభా దామాషా ప్రాతిపదికన పదవుల పంపకాలు ఉంటాయని, ఇటీవలి కులగణనను అందుకు ఆధారంగా చేసుకుంటామని ఆయన ప్రకటించాడు. ప్రజాకర్షణవ్యాఖ్యలు, మిగతాపక్షాలపై విమర్శలను అటుంచితే, పార్టీ నిర్మాణం, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితర ప్రజాప్రతినిధుల ఎంపిక ప్రక్రియల విషయంలో 'జన్ సురాజ్' అనుసరించ బోయే విధానం భిన్నంగా ఉంటుందని ప్రకటించారు. అమెరికా తరహాలో ఆర్నెల్లముందే అభ్యర్థులను ఎంపిక చేయడం, నెగ్గినవారు నచ్చకపోతే వెనక్కురమ్మనడం వంటి ఆసక్తికరమైన ప్రతిపాదనలున్నాయి. కమ్యూనిస్టులనుంచి ఆరెస్సెస్ కార్యకర్తలవరకూ అందరూ తనవారేనంటూ, గాంధీ, అంబేడ్కర్ ప్రవచించిన మానవత్వమే తన పార్టీ ఐడియాలజీ అనీ ఆయన చెప్పుకున్నాడు. తాను పదవులకు దూరంగా ఉండటం, పార్టీ అత్యున్నతస్థానాలకు దళితులు, ఓబీసీలు, మైనారిటీలు ఇత్యాది వర్గాలు నాయకత్వం వహించడం, వంటి నిర్ణయాలు ప్రకటించారు. ఇలాంటి విధానాలన్నీ అట్టడుగుస్థాయిలో జరగడం వంటివి మాటలకు మాత్రమే పరిమితమా, రేపు ఆచరణలో కనిపిస్తాయా అన్నది వేరే విషయం. ఎందుకంటే దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని ఉద్యమ సమయంలో ప్రకటించి, ప్రజలను మోసం చేసిన కెసిఆర్‌ను చూశాం. అలా దళితులు, అణగారిన వర్గాలను ఆకట్టుకునే క్రమంలో తాయిలాలు ఇస్తున్నారు. ఇప్పుడు కులగణన కూడా ఇలాంటిదే. దీనిని చేపట్టి ఏం చేస్తారన్నది చెప్పడం లేదు. మహాత్ముడు తొలి సత్యాగ్రహాన్ని ఆరంభించిన చంపారణ్‌నుంచి ప్రశాంత్ కిశోర్ రెండేళ్ళక్రితం తన పాదయాత్ర మొదలుపెట్టి, మూడువేల కిలోమీటర్ల ప్రయాణంలో ప్రజలతో మమేకం కావడమే కాక, పార్టీకి పునాదులు కూడా వేసుకున్నాడు. ప్రధానంగా వ్యవసాయ, భూసంస్కరణలకు కూడా హామీ ఇచ్చారు. ఇదంతా ఓట్ల రాజకీయమన్నది వేరుగా చెప్పిల్సిన పనిలేదు. రాష్ట్రం నుంచి బ్యాంకులకు సమకూరుతున్నదానిలో నాలుగోవంతు మాత్రమే తిరిగి రుణంగా అందుతున్న తీరును మార్చి, రెట్టింపు వ్యాపార, వ్యవసాయ రుణాలు తేగలనని కొన్ని లెక్కలు చూపారు. ఇది సహజంగానే కొందరికి బాగా నచ్చడంతో కరెక్ట్ అని అంటున్నారు. ఇప్పటికైతే ఆయన చుట్టూచేరిన వారు కూడా దీనిని నమ్ముతున్నారు. దశాబ్దాలుగా వెనుకబడిన బిహార్‌ను ఒకటిరెండు దశాబ్దాల్లో ఉద్ధరించడానికి జన్‌సురాజ్ పార్టీకి నిర్దిష్టమైన ఆచరణమార్గాలు ఉన్నాయని నమ్మ బలుకుతున్నారు. అయితే ఏ రాష్ట్రంలో అయినా ఉన్న పార్టీల మీద కొంత అసంతృప్తి, వ్యతిరేకత ఉంటుంది. అలా బీహార్‌లోనూ పరిస్థితులు ఉన్నాయి. అయితే పికె అధికారంలోకి రావడం అంత సులువు అని చెప్పడానికి లేదు.



Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215